


'మోహన్'

# ఇది విషాదం

సునంద పుట్టింటికి వెళ్ళి వారం రోజులు అయింది. ఆమె ఏ క్షణంలో నైనా దిగవచ్చు.

ఆఫీసులో ఇనస్పెక్షను అంటూ ఏడవకపోతే ఈ వారంరోజులుగా "ఫెస్టివల్ సెలబ్రేషన్స్"లో వుండేవాడిని. కానీ ఎంత గింజుకున్నా ఇవాల్టివరకూ సెలవు పెట్టటాని' వీలుపడలేదు.

ఉదయంనుంచీ ఇంట్లోనే రెస్టు తీసుకున్నాను. సాయంకాలం ఏడు గంటలకు చలపతిని వెంటపెట్టుకుని "రాజకుమారి" బార్‌లో పార్టీ చేసుకోవాలని ప్రోగ్రాం. అసలు ఈ ప్రోగ్రాం ఎరేంజ్ చేసింది కూడా చలపతే.

సుల్తానుబజారు హాస్పిటలు దగ్గర గల మరాఠీ గ్రంథ సంగ్రహాలయం గోడకి ఆనుకుని చలపతి కోసం ఎదురు చూడసాగాను. సమయం ఇంకా ఆరున్నర కూడా కాలేదు. వచ్చేపోయే మనుషులను చూస్తూ కాలం గడపసాగాను.

ఇంతలో నాకు రెండు గజాల దూరంలో నిలబడ్డ ఓ వ్యక్తి మీద నా దృష్టి పడింది.

ఆ మనిషికి పాతికేళ్ళు వుంటాయి. గడ్డం పెరిగింది బట్టలు కొస్త మురికిగా కూడా వున్నాయి. కాళ్ళకి హవాయి చెప్పులు, చేతిలో పాత ఇలస్ట్రేటెడ్ వీక్లీ వుంది.

అతని ధోరణి విచిత్రంగా వుంది.

అతను అటూ ఇటూ కాకుండా సూటిగా ఆకాశం వంక చూస్తున్నాడు. అందుకే కాబోలు అంతమందిలో అతన్నే ప్రత్యేకంగా గమనించటం జరిగింది.

అతన్ని ఇంతకుముందు ఎక్కడో చూసినట్టు గుర్తు. ఎవరై వుంటానా అని ఆలోచించసాగాను.

ఎంతకీ గుర్తురావటం లేదు.

అతన్ని ఈ మధ్యనే ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది. నేను పొర పాటు పడటంలేదు. అతని ముఖం నాకు బాగా పరిచయం.

అయితే ఎప్పుడు ఎలా అతనితో పరిచయం అయిందో అంతుపట్టటంలేదు. కనీసం అతని పేరు కూడా గుర్తులేదు.

నేను పనిచేసే ఫ్యాక్టరీలోని మూడు వేలమందిలో ఎవరైనా ఒకరు కావచ్చు. లేక ఏ బార్‌లోనో పరిచయం అయి వుండవచ్చు. కాకపోతే నేను గతంలో చూసిన పాతిక పెళ్ళిళ్లలో ఓ ఆడపిల్లకి అన్న అయివుండాలి.

అతడు ఇప్పుడు నా పాలిటికి ఓ క్రాస్ వర్డ్ పజిల్‌లా వున్నాడు అన్నది తెలుస్తూనే వుంది. పైకి చెప్పలేకపోతున్నాను.

అతన్ని అడిగి వివరాలు తెలుసుకోవచ్చు. కానీ అందులో థ్రిల్ లేదు. అందుకే మరింత తీవ్రంగా ఆలోచించసాగాను.

అంతే! ఆకాశంలో క్షణంపాటు మెరుపు మెరిసినట్టుగా, అతనెవరో గుర్తు వచ్చింది!

ఇవాల్టి న్యూస్‌పేపరులో "తప్పిపోయినారు" కాలంలో అతని ఫోటో వుంది. ఉదయం నుంచీ ఇంట్లో ఖాళీగా వున్నానేమో, ఏమీ తోచక పేపరు అంతా పూర్తిగా తిరగేసాను. అప్పుడే ఒకటి రెండు సార్లు ఈ వ్యక్తి ఫోటో చూడటం జరిగింది.

అయితే, ఈ ఫోటోలో వ్యక్తి ఇతనూ ఒకరేనా లేక నేను భ్రమపడుతున్నానా అన్న అనుమానం కలిగింది. వెంటనే ప్రక్కనే వున్న బుక్‌స్టాల్‌లో పేపరు కొని, ఆ ఫోటోని ఎదురుగా వున్న ఆ వ్యక్తిని మార్చిమార్చి చూసాను.

సందేహం లేదు. ఇతను, ఆ ఫోటోలో వ్యక్తి ఇద్దరూ ఒకరే. ఆ ఫోటో కింద వివరణ ఇలా వుంది.

"రాజా! నువ్వు వెళ్ళినప్పటినుంచీ, నీ కోసం మీ అమ్మ దిగులుపడుతూంది. మెడికల్‌షాపు అజమాయిషీ నీ చేతికి ఇవ్వలేదని కోపంవచ్చి వెళ్ళిపోయావు. నువ్వు వెంటనే తిరిగి రావలసినది. మెడికల్ షాపు నీకు అప్పచెప్పుతాను. ఇప్పుడు మరోచోట ఇంకో షాపు ఓపెన్ చేసి ఇస్తాను.

పై ఫోటోలోని వ్యక్తి ఆచూకీ తెలిసినవారు టెలిఫోన్ ద్వారా తెలియచేయగలరు. ఆచూకీ తెలిపిన వారికి అయిదు వందల రూపాయిల బహుమానం ఇవ్వగలము."

అని కింద టెలిఫోన్ నంబరు వ్రాసి వుంది.

ప్రకటన చదువుతుంటే, ఆ తల్లిదండ్రులు ఇతనికోసం ఎంత ఆవేదన చెందుతున్నారో అని నా మనసు బాధపడసాగింది.

జన్మనిచ్చి పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులకు సేవచేసి సుఖపెట్టవలసింది పోయి వారిని మానసిక వ్యథకు గురి చేస్తున్న ఈ వ్యక్తిపై నాకు క్షణకాలం అంతులేని కోపం వచ్చింది.

తల్లిదండ్రుల విలువ వారిని పోగొట్టుకున్న నాకు బాగా తెలుసు. వారికి సేవచేసి ఆనందపరిచి, నేను ఆనందం పొందే అవకాశం లేకపోయినందుకు

జీవితంలో నేను ప్రతిసారి బాధపడుతూనే వుంటాను.

వారు ప్రకటించిన అయిదు వందల రూపాయిల బహుమానం కోసం కాదు కానీ, ఇతన్ని ఆ తల్లిదండ్రుల వద్దకు చేర్చి, వారి దుఃఖనివారణ చేయాలని నిర్ణయించుకున్నాను.

నా దృష్టనుంచి తప్పిపోకుండా, అతన్ని "వ్యూ" లో పెట్టుకుని వెంటనే పక్కనేవున్న షాపులో జొరబడి న్యూస్ పేపరులో ఇవ్వబడిన నంబరుకు టెలిఫోన్ చేశాను.

అవతలి వైపున డయల్ అవుతున్న శబ్దం రావటం లేదు. "ఎంగేజ్డ్ టోన్" వచ్చింది. మరో రెండు సార్లు ట్రై చేసాను. మళ్ళీ అంతే !

ఇంతసేపు వాళ్ళ టెలిఫోన్ ఎంగేజ్ చేసి వుంచటమేమిటి ?

అతను జనసమూహంలో కలిసిపోతే మళ్ళీ దొరకడు. టెలిఫోన్ తరువాత అయినా చెయ్యవచ్చు-అనుకుంటూ, తిన్నగా అతన్ని చేరుకున్నాను.

అతనప్పుడు చేతిలోని ఇలస్ట్రేటెడ్ వీక్లీ తెరిచి అందులో ఏదో చూస్తున్నాడు.

నేను దగ్గరకు వెళ్ళి — "మిస్టర్ రాజా" అంటూ చిరపరిచయంగల మిత్రుడిలా పలకరించాను.

తల ఎత్తి చూడకుండానే "యస్" అంటూ జవాబు చెప్పారు. అతను ఇంకా మాగజైన్ చూస్తూనే వున్నాడు.

తప్పిపోయినట్లు అతని గురించి పేపరులో వచ్చిన విషయం అతనికి తెలియకపోవచ్చు. ఇప్పుడు నేను అసలు సంగతి బయటపెట్టకుండా అతన్ని ఫాలో చెయ్యాలి

రాజు గొడవలో పడి మందుపార్టీ విషయం మరిచిపోయాను. అంతేకాక ఏడుగంటలకు వస్తానన్న చలపతి ఇంత వరకూ రాలేదు. ఏదో అవాంతరం వచ్చే వుండాలి. ఇక రాకపోవచ్చు కూడా. ఇప్పుడిక పార్టీ మూడ్ లేదు.

"రాజాగారూ" అంటూ మళ్ళీ పలకరించాను

ఈసారి అతను తల ఎత్తి నా ముఖం లోకి చూసి "హలో" అంటూ చెయ్యి ముందుకు చాపి నాతో కరచాలనం చేశాడు.

'మీరు నన్ను గుర్తుపట్టారా' అంటూ అతన్ని మాటల్లోకి దించబోయాను.

'గుర్తుపట్టకపోవటమేమిటి ? అంత త్వరగా ఎలా మరిచిపోతాననుకున్నారు' అంటూ ఆశ్చర్యంతో కూడిన ప్రశ్నలు వేశాడు.

ఆశ్చర్యపోవటం ఈసారి నా వంతు అయింది. అతను నన్ను గుర్తుపట్టడం ఏమిటి? అతన్ని చూడటం ఇదే మొదటి సారి.

'అయితే ఇంతకుముందు నన్నెక్కడ చూసారో చెప్పండి!'

'అయితే మీరు నా జ్ఞాపకశక్తిని పరీక్షిస్తున్నారా!'

"అబ్బే! మిమ్మలను పరీక్షించటం లేదు. కానీ గతంలో మీకో నాకు పరిచయం ఎప్పుడు అయిందా అని ఆలోచిస్తున్నాను" అన్నాను వంజాయిషీ చెప్పుకుంటున్నట్టుగా.

నేనేదో అకన్ను తెలివిగా "డీల్" చెయ్యాలని ప్రయత్నిస్తే, అతనే నన్ను తికమక పెట్టేలా వున్నాడు. ఏది ఏమైనా సిట్యుయేషన్ ఇంటరెస్టింగ్‌గా వుంది. చివరికి ఎలా అవుతుందో అనే క్యూరియాసిటీ నాలో అధికం అయింది.

"మాస్కోలో స్పేస్ రిసెర్చి ఇనిస్టిట్యూట్‌లో మనిద్దరం రెండేళ్లు కలిసి పనిచేసాం కదండీ" అంటూ మందహాసం చేసాడు రాజు.

నేను తెల్లమొహం వెయ్యాల్సి వచ్చింది.

మాస్కో ఏమిటీ? రిసెర్చి ఇనిస్టిట్యూట్ ఏమిటీ?

నో! నో! నే నెవరో అనుకుని ఇతను భ్రమపడుతున్నట్లున్నాడు.

అయితే అతను అనుకుంటున్న వ్యక్తిని నేను కాదని చెప్పాలా లేక అతన్ని అదే భ్రమలో ఉంచాలా?

నేనెవరయింది అతనికి తెలియాల్సిన అవసరం లేదు. అతన్ని తన ఇంటికి చేర్చటం వరకే నా బాధ్యత. కాబట్టి అతనితో మరికొంత పరిచయం పెంచుకుని, నెమ్మదిగా అతని అడ్రసు తెలుసుకోవాలి అనుకున్నాను.

"అన్నట్లు మిస్టర్ రాజూ! ఇందాక మీరు చాలాసేపు ఆకాశంలోకి చూస్తూ వున్నారు. ఆకాశంలో మీకు ఆసక్తి కలిగించిన విషయం ఏమిటీ? అన్నాను ప్రసంగం పొడిగిస్తూ.

"రష్యావాళ్లు అంతరిక్షంలోకి ఒక భారతీయుడ్ని పంపిస్తామన్నారుకదా! ఒకవేళ ఆ ఆఫర్ నాకు వస్తే వెళ్ళాలా వద్దా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రాజు మళ్ళీ ఆకాశంలోకి చూస్తూ.

రష్యావాళ్ళు ఒక భారతీయుణ్ని అంతరిక్షంలోకి పంపిస్తామన్న విషయం పేపరులో చదవటం జరిగింది. అయితే హైదరాబాదులో రోడ్లమీద తిరిగే ఇతనినిఎందుకు పంపిస్తారు?

ఏమో! ఇతను నిజంగా సైంటిస్టు అయినా కావచ్చు. శాస్త్రవేత్తలు అతి నిరాడంబరంగా వుంటారుట కానీ ఇతనికి పాతికేళ్ళకు మించి లేవు. అలాంటిది ఇంత చిన్నవయసులో రష్యా దృష్టిలో పడగల పెద్ద సైంటిస్టు ఎలా అయ్యాడు. ఏమిటో అంతా గందరగోళంగావుంది.

ఇతను సైంటిస్టు కానిపక్షంలో పిచ్చివాడు అయి వుండాలని నిర్ణయించుకున్నాను.

"అయితే మిస్టర్ రాజూ! మీకు ఆ ఆఫర్ వస్తే మరి వెళ్ళరా" అన్నాను.

"వెళ్ళవద్దనే అనుకుంటున్నాను" అన్నాడు.

"ఆదేమిటి! అలాంటి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదుకదా! అంతేకాక బోలెడంత పేరు వస్తుంది" అనాను నేను.

"అవుననుకోండి కానీ అంతరిక్షం లోకి వెళ్తే తిరిగి రావటానికి ఎన్నాళ్ళు పడుతుందో ఏమో. అంతవరకూ అన్నం తినకుండా వుండాలంటే మాటలా?"

అంతరిక్షంలోకి వెళ్ళిన వ్యక్తి తిరిగి వచ్చేవరకూ అన్నం తినకూడదా? ఏమో, నాకు అంత పరిజ్ఞానం లేదు. ఆపరేషన్ చేయించుకునే ముందు ఆహారం తీసుకో కూడదు. అలాగే ఇదికూడానేమో మరి.

"అయితే అన్నం తినకుండా ఎవరైనా అన్ని రోజులు ఎలా ఉండగలుగుతారు" నా ప్రశ్న.

"అన్నం అంటే అన్నం ఇవ్వరు. కానీ వేరే ఆహారపదార్థాలు ఇస్తారు. బిస్కట్లు, డ్రై ఫ్రూట్స్, లిక్విడ్ ఫుడ్ లాంటివి."

"మరింకేం"

"కానీ నాకు అన్నం అంటేనే ఇష్టం. అన్నం తిని ఇప్పటికే రెండురోజులు అయింది. ఈ స్థితిలో రష్యావాళ్లు కాదు గదా అమెరికావాళ్ళు ఆఫర్ పంపినా అన్నం వదిలి అక్కడకు వెళ్ళను" అంటూ పిచ్చిగా నవ్వసాగాడు.

అతని నవ్వు, ఆ ధోరణి చూసిం తరువాత నా అనుమానం బలపడింది.

ఇతను మానసికంగా ఆరోగ్యంగా లేడు. మతి భ్రమించినట్లుంది.

ఇందాక అతను ఆకాశంలోకి చూడటం, రష్యాలో రిసెర్చి చేసినట్లు చెప్పటం, ఇంకా అన్నం గురించి మాట్లాడటం ఇవన్నీ మతి భ్రమణంలో చేసిన చర్యలే.

ఈ పిచ్చివ్యక్తిని ఇప్పుడు ఏం చేయాలి నా కెందుకులే అని వదిలి, నా దారిన నేను వెళ్ళటమా లేక అతన్ని వాళ్ళింటికి చేర్చటమా అన్న మీమాంసలో వడ్డాను.

కానీ, రాజుతండ్రి చేసిన ప్రకటన కళ్ళముందు మెదిలింది ఇతన్ని తన ఇంటికి చేర్చి ఇంతకుముందు నేను అనుకున్నట్టుగా ఆ తల్లిదండ్రులకు ఊరట కలిగించటం నా కర్తవ్యంగా నిర్ణయించుకున్నాను.

ఇంతలో— "అన్నం తిని ఇప్పటికి రెండురోజులు అయింది" అన్న రాజు మాటలు గుర్తువచ్చాయి.

వెంటనే ఆటో ఎక్కి అతన్ని తీసుకుని హోటల్ స్వాగత్‌కి బయలుదేరాను

నాతో రానంటాడేమోనని సందేహించాను. కానీ అతను ఎలాంటి పేచీ పెట్టలేదు.

అన్నం చూడగానే అతను సర్వం మరిచిపోయి ఆవురావురుమని తింటూంటే, నాకు జాలివేసింది.

నా భోజనం ముగిసింది. అతను ఇంకా తింటూనే వున్నాడు నేను నెమ్మ

దిగా లేచి కొంటరుమీద టెలిఫోన్ వద్దకు చేసుకున్నాను.

టేబిలోని డైలీపేపరు మడతలు విప్పి, మరోసారి టెలిఫోన్ నంబరు చూసి, రాజుతండ్రికి డయల్ చేసాను. కాల్ కనెక్టు కాలేదు. అవతలి ఫోన్ ఎంగేజ్‌లో వున్నట్టుగా అర్థం అవుతూంది.

చేతి గడియారం చూసుకుంటే ఎనిమిదిన్నర అయింది. ఇంతసేపటివరకు ఆ టెలిఫోన్ ఎంగేజ్‌లో ఎలా వుంటుంది. ఒకవేళ ఫోన్ "డెడ్" అయిపోయివుండాలి.

రాజుతండ్రి అడ్రసు తెలుసుకోవాలంటే —

న్యూస్‌పేపరులో ఒక్క టెలిఫోన్ నంబరు తప్ప మరో ఆధారం ఇవ్వలేదు. ఫోన్ అందటంలేదు.

ఇప్పుడు కర్తవ్యం ఒక్కటే మిగిలింది. రాజు ద్వారానే అతని ఇంటి అడ్రసు తెలుసుకోవాలి. కానీ అతను చెబుతాడా. అసలే మతిభ్రమణంలో వున్నాడు.

ఇద్దరం మళ్ళీ ఆటో ఎక్కి మా ఇల్లు చేరుకున్నాము.

నేను తాళంతీసి లోపలికి ప్రవేశించాను.

రాజు నన్ను అనుసరించాడు.

నేను డ్రస్ మార్చుకుంటూండగా రాజు అటకమీద వున్న చాప తీసి నేల మీద పరుచుకుని, దానిమీద కాళ్ళుర జాపుకుని పడుకున్నాడు. మనిషి చాలా అలిసిపోయినట్టున్నాడు. తృప్తిగా భోజనం చేసాడేమో, నిద్ర ముంచుకు వస్తున్నట్లుంది, నిద్రపోకముందే అతని ఇంటి అడ్రసు తెలుసుకోవాలి.

"చూడు రాజా! మీరు వుండే దెక్కడ. మీ ఇంటి అడ్రసు చెప్పు" అన్నాను అనునయంగా.

"మా అడ్రసు మరిచిపోయారా! మీకు మతిమరుపు జాస్తిలా వుంది. మాస్కోలో మెట్రో రైల్వేస్టేషనుముందు గల పెద్ద బిల్డింగ్‌లో టెంత్ ఫ్లోర్‌లో వుంటున్నాము."

అతను ఇంకా మాస్కో ధోరణి వదలిపెట్టలేదు.

"మాస్కో కాదు హైదరాబాదులో మీ ఇల్లు ఎక్కడ."

"ప్రస్తుతం ఇదే మా ఇల్లు" అన్నాడు.

నేను మరో ప్రశ్న వేసేలోపున అతను నిద్రలోకి జారుకున్నాడు. రేపు వుదయం వరకూ అతను నిద్రనుంచి లేచేలాలేడు.

ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని అతను అంతవరకు పట్టుకుతిరిగిన ఇలస్ట్రేటెడ్ వీక్లీ పేజీలు తిరగేశాను. నాకు కావలసిన సమాచారం దొరకలేదు.

సమయం రాత్రి పది కావస్తుంది. నేనుకూడా నిద్రపోవటం తప్ప మరో పనిలేదు.

ఇంతలో చలపతి వచ్చాడు.



"సారీ గురూ! టైముకి రాలేకపోయాను. అనుకోకుండా ఓ బంధువు రావటంతో అతన్ని ఎటెండ్ చేయక తప్పింది కాదు" అంటూ బేగ్‌లోంచి "మేక్‌దోవెల్" బాటిలు, ఫుడ్ పాకెట్లు తీసి టీపాయిమీద పెడుతూ— "అన్నట్టు ఇతనెవరు" అంటూ రాజుని చూపించాడు.

రాజు గురించి నేను సోదాహరణంగా వివరించబోతే "ఆగు ముందు ఒక రౌండ్ కానిద్దాం" అంటూ చలపతి అలమారాలోంచి గ్లాసులు తీసి అన్నీ రెడీ చేయసాగాడు.

మందు చూసింతరువాత నేను అప్పటికి భోజనం చేసానన్న సంగతి మరిచిపోయాను.

సెకండ్ రౌండ్ పూర్తి అయ్యేసరికి రాజుగురించి చెప్పటం కూడా అయిపోయింది.

"అతని ఇంటి అడ్రసు ఎలాగూ తెలిసేలా లేదు. రేపు నువ్వు ఆఫీసుకు వెళ్ళాలి. ఇతన్ని ఇలాగే ఇంట్లో వదిలి వుంచలేవు కాబట్టి రేపు వుదయం ఇతన్ని తీసుకువెళ్ళి పోలీసు స్టేషనులో అప్పగించు. వాళ్ళే ఇతని 'కేర్' తీసుకుంటారు" అన్నాడు చలపతి.

అతను చెప్పింది సబబు అనిపించింది. అంతకంటే వేరే మార్గం లేదు. అతని ఇంటి అడ్రసు తెలుసుకుని పోలీసులు అతన్ని ఇల్లు చేరుస్తారు.

మరునాడు నాకు మెలకువ వచ్చేసరికి రూములో రాజు లేడు. చాపచుట్టి యధాస్థానంలో వుంచబడింది.

ఏమైనా సామానులు ఎత్తుకుపోయాడేమోనని, కంగారుపడసాగాను. కానీ ఏమీ పోలేదు. చేతి గడియారం, పర్సు అన్నీ టేబులు మీద అలాగే వున్నాయి.

టేబులుమీద మడచి పెట్టిన ఓ కాగితం కనపడింది.

"డియర్ సార్ !

నా పేరు రాజు కాదు. నా అసలు పేరు ఏది అయినా మీకూ నాకూ గల అనుబంధంలో మార్పు రాబోదు.

నేను పోస్టుగ్రాడ్యుయేట్‌ను. ఏదో ఇంటర్వ్యూ ఎటెండ్ చేయాలని హైదరాబాదు వచ్చాను. తిరిగి ఇంటికి వెళ్ళేందుకు డబ్బు లేదు. వెళ్ళి చేసేది కూడా ఏమీ లేదు. అక్కడ నా వృద్ధ తల్లిదండ్రులకు మరింత భారంకావటం తప్ప.

హైదరాబాదులోనే వుంటూ వుద్యోగప్రయత్నం చేసుకుంటున్నాను. చేతిలో దమ్మిడీ లేదు. తెలిసినవారు గానీ, ఆదరించేవారు గానీ లేక రోడ్లమీదపడి తిరుగుతున్నాను. ఇట్టి స్థితిలో పొట్ట నింపుకునేందుకు ఏదో వుపాయం ఆలోచించక తప్పలేదు.

అందువల్ల తప్పిపోయినట్టు పేపరులో నా ఫొటో నేనే ప్రకటించుకున్నాను. ఆ మెడికల్ షాపు, ఆ టెలిఫోన్ నంబరు అంతా అబద్ధం.

ఓ పూట తిండిపెట్టి ఆశ్రయం ఇచ్చిన మీ దయాగుణం మరిచిపోలేను. మీ ఆదరణకు కృతజ్ఞుడను.

ఇట్లు,
ఓ నిరుద్యోగి.

నిరుద్యోగి జీవితం ఎంత దుర్భరంగా వుంటుందో నాకు అనుభవపూర్వకంగా తెలుసు.

ఆ పుత్తరం చదివిన తరువాత నా మనసు తరుక్కుపోయింది.

---